ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024



పరిశ్రమల భద్రతపై నేడు సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎసెన్షియా కర్మాగారంలో ఘోర ప్రమాదం జరిగి 17 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమల భద్రతపై శనివారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో, మధ్యాహ్నం మూడుగంటలకు విశాఖ కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా చర్యలు, శిక్షణ, ఇతర అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో కఠినమైన నిర్ణయాలతో ప్రణాళిక రూపొందించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

కార్మికులతో చెలగాటం

అర్హత, అనుభవం లేకున్నా ఫార్మా కంపెనీల్లో విధులు

శిక్షణ విషయంలో యాజమాన్యాల నిర్లక్ష్యం

- హైదరాబాద్‌తో పోల్చితే రీసెర్చి ల్యాబ్‌లు తక్కువే

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో భారీ ప్రమాదం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వందలాది కంపెనీల్లో ఉద్యోగులు/కార్మికుల అర్హత, అనుభవంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత లేకపోయినా తక్కువ వేతనాలకు దొరుకుతున్నారన్న దురాశతో ఉద్యోగులు, కార్మికుల జీవితాలతో కంపెనీలు చెలగాటమాడుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎసెన్షియా కంపెనీలో కూడా కొద్దిమంది మినహా మిగిలిన వారంతా అనుభవంలేని వారేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలే అంచనాకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. మిగిలిన రంగాలకు భిన్నమైన పనివిధానం ఉండే కెమికల్/ ఫార్మా కంపెనీల్లో అందుకు తగిన అర్హతలున్నవారికి మాత్రమే తీసుకోవాల్సి ఉన్నా అనేక కంపెనీలు అవేవీ పట్టించుకోవడంలేదని, ప్రమాదం సంభవిస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ చేసే అనుభవం ఉన్న వారు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.



ప్రమాదం జరిగిన ఎసెన్షియా పరిశ్రమ (ఫైల్ ఫొటో)

డిగ్రీ విద్యార్థులే అధికం..

ఫార్మా, కెమికల్ కంపెనీల్లో ఎక్కువగా బీఎస్సీలో కెమిస్ట్రీ చదివే విద్యార్థులను తీసుకుంటున్నారు. వీరికి తొలుత నెలకు రూ. 10వేల నుంచి రూ.15వేల వరకు జీతం ఇస్తారు. తరువాత క్రమేపీ పెంచుతారు. అదే ఎమ్మెస్సీ విద్యార్థులకు ప్రారంభ దశలోనే రూ. 25వేల వరకు ఇవ్వాలి. ఈ కంపెనీల్లో పనిచేయాలంటే రసాయన ప్రక్రియలు తెలిసి ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ ప్రహసనంగా మారింది. విద్యార్థులకు తెలియవు. పీజీకి వచ్చినా విశ్వవిద్యాలయాల్లో తప్ప ప్రైవేటు కళాశాలల్లో రసాయనాలతో లేబొరేటరీ తరగతులు నిర్వహణ తూతూమంత్రంగా ఉంటుందిలేదా అసలు ఉండదు.నాలుగైదు దశాబ్దాల క్రితం ఉన్నత పాఠశాలల్ల భౌతిక, రసాయన పరీక్షలు నిర్వహించేవారు. అందుకు అవసరమైన కెమికల్స్ ప్రభుత్వమే సరఫరాచేసేది. ఇప్పుడు పీజీలో తప్ప ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కెమికల్స్ సరఫరా అనేది ఉండదు. ఈ నేపథ్యంలో డిగ్రీచదివిన విద్యార్థులు ఫార్మా కంపెనీలకు ఎంపికైనా రసాయనాలతో పనిచేసే అనుభవం ఉండదు.. ఎక్కువమందికి అసలు తెలియదని రిటైర్డు రసాయన శాస్త్ర అధ్యాపకుడు శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

చిన్న పరిశ్రమల్లో శిక్షణ నిల్

మల్టీనేషనల్ కంపెనీలు/ పేరున్న కంపెనీలు డిగ్రీ విద్యార్థులను నియమించుకున్న తరువాత కనీసం ... మిగతా 8వ పేజీలో

సినర్జిన్ ఫార్మాలో ప్రమాదం


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్ల

రసాయనాలు ఎగసిపడి నలుగురికి గాయాలు

- విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- గురువారం అర్ధరాత్రి ఘటన

- వివరాలు మెయిన్‌లో

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

- ఎసెన్షియా కర్మాగారంలో సెన్సార్లు ఏమైనట్టు?
- పొగ, వాసన పసిగట్టే పర్యవేక్షణ లోపమా
- పీరియాడికల్ తనిఖీలు శూన్యం

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్‌పై ఇంజనీరింగ్ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. వాసన, పొగ (ఆవిరి) పసిగట్టే సెన్సార్లు ఎందుకు అలారం మోగించలేదు.. అసలు సెన్సార్లు ఉన్నాయా? ఉంటే పనిచేస్తున్నాయా? అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదానికి వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్ కారణమా.. లేదా ఇతరత్రా సమస్య వల్ల ప్రమాదం జరిగిందా అనేది తేలాల్సి ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే తప్ప వాస్తవాలు తెలియవని ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యుడొకరు వివరించారు.


ఎసెన్షియా పరిశ్రమలో పేలుడు ధాటికి కూలిన భవనం గోడ (ఫైల్)

ఫార్మా కంపెనీల్లో ఉత్పత్తి సమయంలో అనేక రకాలైన కెమికల్స్ వినియోగిస్తారు. ఈ సమయంలో వాసన, పొగ ఉత్పత్తి లీకులను గుర్తించేందుకు ఎక్కడికక్కడ సెన్సార్లు ఏర్పాటుచేస్తారు. ఇవి పెద్ద ఖరీదు కూడా కాదు. వీటిని ఏర్పాటు చేసిన తరువాత నిరంతరం పర్యవేక్షించాలి. సెన్సార్లు లేకుండా కంపెనీల్లో ఉత్పత్తులకు అనుమతి ఇవ్వకూడదు. అయితే ఎసెన్షియా కర్మాగారం మూడో అంతస్తులో రియాక్టర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి పంపే సాల్వెంట్ లీకై ఎలక్ట్రికల్ ప్యానళ్లపై పడి ఆవిరిమేఘంగా కమ్ముకుంది. ఇది ఎలక్ట్రికల్ ప్యానల్స్ నుంచి భవనంలోని అన్ని మూలలకు చేరింది. ఈలోగా ఎలక్ట్రికల్ ప్యానల్స్ ఉన్న గదిలో మంటలు రేగడంతో ప్యానల్స్ పైపుల ద్వారా క్షణాల్లో భవనం మొత్తం వ్యాపించి భారీ పేలుడు సంభించిందని ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది.

దీనిపై ఇంజనీరింగ్ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ఇంట్లో కొద్దిగా గ్యాస్ లీకైతే వెంటనే అప్రమత్తమై సిలెండర్ వద్ద రెగ్యులేటర్ కట్టేస్తాం.. సిలెండర్ నుంచి గ్యాస్ స్టౌకు కనెక్టుచేసే పైపు తనిఖీచేస్తాం.. స్టౌ బర్నర్ కట్టేసి వంట గది కిటికీలు తెరిచి ఉంచుతాం. అటువంటప్పుడు కర్మాగారంలో ఎలక్ట్రికల్ ప్యానళ్ల ఉన్న గది మొత్తం ఆవిరి మేఘం కమ్మేసినపుడు తప్పకుండా వాసన వస్తుంది. గది క్లోజ్డ్ హాలు కావడంతో ఆవిరి ... మిగతా 8వ పేజీలో

ఫార్మా ప్రమాదాలపై విచారణ చేపట్టాలి

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అనకాపల్లిలో క్షతగాత్రులకు పరామర్శ

- వివరాలు మెయిన్‌లో


ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ సీఎం జగన్

క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ


క్షతగాత్రునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం పరామర్శించారు. ఆస్పత్రిలోని వైద్యం పొందుతున్న ప్రతి ఒక్కరిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కుటుంబసభ్యులను కలిసి కలెక్టర్ మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను డాక్టర్ అవినాష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ సంఘటనపై ఏపీఐఐసీ, బ్రాయిలర్, ఫైర్, పరిశ్రమల తదితర జిల్లా అధికారులతో సమీక్షించామన్నారు. పారిశ్రామికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యోగుల భద్రతపై చర్యలు చేపడతామన్నారు. సంఘటనలో ... మిగతా 8వ పేజీలో

పరిహారం చెక్కుల పంపిణీ

- 17 మంది ఇళ్లకు వెళ్లి రూ.కోటి చొప్పున అందజేత
- వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 23: అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్ సైన్స్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 17 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా కింద కోటి రూపాయల చొప్పున అందజేసినట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాకు చెందిన వేగి సన్యాసినాయుడు భార్య వేగి అచ్చియ్యమ్మ, ఎల్లబిల్లి చిన్నారావు భార్య ఎల్లబిల్లి లోవమ్మకు, పూడి మోహన్ దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యుడు పూడి సూర్యారావుకు, జవ్వాది చిరంజీవి కుటుంబ సభ్యురాలు చెల్లా వీణాదేవి, పూసర్ల వెంకటసాయి కుటుంబ సభ్యురాలు పూసర్ల మహాలక్ష్మి, వెంకట నాగఅప్పలశెట్టి కుటుంబసభ్యులకు రాంబిల్లి డిప్యూటీ తహసీల్దార్ ఎం.గణపతిరావు వారి ఇళ్లకు తీసుకువెళ్లి చెక్కులను అందజేసినట్టు కలెక్టర్ చెప్పారు. విశాఖ జిల్లాకు చెందిన నీలాపు రామిరెడ్డి కుటుంబసభ్యురాలు దొండా సునీతాకు, బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు కుటుంబసభ్యురాలైన బొడ్డు కనక మహాలక్ష్మికు రేలుగుంట తహసీల్దార్ కె.వరహాలు చెక్కులను స్వయంగా అందించారన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన మృతుడు ఒమ్మిడి ఆనందరావు కుటుంబసభ్యురాలైన సత్యవతికు, మహంతి నారాయణరావు కుటుంబసభ్యురాలైన మహంతి స్వాతికు చోడవరం డీటీ పి. సత్యనారాయణ చెక్కులను అందించారని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. అలాగే శ్రీకాకుళం జిల్లాకు చెందిన హెచ్.ప్రశాంత్ కుటుంబ సభ్యురాలైన పునుమజ్జి జ్యోతికు, పైడి రాజశేఖర్ కుటుంబసభ్యుడు అయిన పైడి ధర్మారావుకు స్వయంగా కె.కోటపాడు డీటీ డి.రమేష్ బాబు చెక్కులను అందజేశారన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె. గణేష్‌కుమార్ కుటుంబ సభ్యురాలైన పడుచూరి అరుణకుమారిలకు వి.మాడుగుల డీటీ ఎం.రాజా చెక్కును అందజేశారన్నారు. కాకినాడకు చెందిన చెల్లపల్లి హారిక కుటుంబ సభ్యురాలు చెల్లపల్లి అన్నపూర్ణకు, మొండి నాగబాబు కుటుంబ సభ్యురాలైన మొండి సాయి దుర్గాకు నర్సీపట్నం డీటీ వై.శ్యామ్‌కుమార్ చెక్కులను అందించినట్టు చెప్పారు. భద్రాది కొత్తగూడెంకు చెందిన ఎం.సురేంద్ర కుటుంబసభ్యురాలు పరుచూరి దీపకు దేవరాపల్లి డీటీ జి.ఆనందరావు చెక్కును అందజేశారన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురానికి చెందిన మరిశెట్టి సతీష్ కుటుంబ సభ్యురాలు మరిశెట్టి సాయి శ్రీవినాయక దుర్గా రమాకు మునగపాక డీటీ టీహెచ్. వినయ్‌కుమార్ అందించారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన జవ్వాది పార్థసారథి కుటుంబ సభ్యుడైన కోటేశ్వరరావుకు కశింకోట డీటీ కె. సురేష్‌నాయుడు ఇంటికి తీసుకువెళ్లి చెక్కును అందించినట్టు చెప్పారు.


ఖమ్మం జిల్లా వాసి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న అధికారులు

జగన్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

ఐదేళ్లలో వేసిన రోడ్లను తవ్వేశారు

- ఉపమాక గ్రామసభలో ధ్వజమెత్తిన హోం మంత్రి అనిత


గ్రామసభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 23: వైసీపీ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని వంగలపూడి హోం మంత్రి అనిత అన్నారు. మండలంలోని ఉపమాకలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్ పాలనలో ఉపాధి పథకాన్ని పక్కన పెట్టేశారన్నారు. గతంలో టీడీపీ పాలనలో వేసిన రోడ్లను పైపులైన్ల పేరుతో వైసీపీ పాలకులు తవ్వేశారన్నారు. కూటమి పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థకు జవసత్వాలు చేకూర్చే దిశగా సీఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ఉపమాక పంచాయతీ పరిధిలో వున్న 9 శివారు గ్రామాల సమస్యల గురించి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి వివరించారు. దీనిపై స్పందించిన హోం మంత్రి ... మిగతా 8వ పేజీలో

జగన్‌కు మతిభ్రమించింది.. .8లో

- ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాం
- ధర్నా చేస్తే భయపడే పరిస్థితి లేదు : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

ఆర్టీసీ స్థలంపై మరోసారి రాజుకున్న వివాదం

7,550 గజాల టెండర్ దక్కించుకున్న డాక్టర్ శ్రీనివాస్

- నెలకు రూ.4.16 లక్షలు అద్దె చెల్లిస్తున్న లీజుదారుడు
- మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి నిర్ణయం
- స్థలాన్ని చదును చేయిస్తున్న లీజుదారుడు
- ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ఖాళీ స్థలం ఆర్టీసీ అవసరాలకు ఉంచాలన్న స్పీకర్

నర్సీపట్నం, ఆగస్టు 23 :

ఆర్టీసీ స్థలం లీజు వ్యవహారం మరోసారి వివాదానికి తెరలేపింది. లీజుదారుడు స్థలం చదును చేసేందుకు గురువారం రాత్రి గ్రావెల్ తోలడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. పదవినైనా వదులుకుంటాను గాని స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయనివ్వనని ఘంటాపథంగా చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఈ స్థలం ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తే అయ్యన్నపాత్రుడు అడ్డుకున్నారు. ఆర్టీసీ అధికారులు రెండోసారి అదే తప్పు చేయడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. వివరాలిలా ఉన్నాయి.


ఆర్టీసీ స్థలంలో లీజ్‌దారు శ్రీనివాస్ తోలించిన మట్టి


ఆర్టీసీ డీఎంని నిలదీస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గత వైసీపీ ప్రభుత్వంలో నర్సీపట్నం ఆర్టీసీ డిపోలోని 7,550 చదరపు గజాల స్థలం అద్దెకు ఇవ్వడానికి గత ఏడాది టెండర్లు ఆహ్వానించారు. విశాఖపట్నంకు చెందిన డాక్టర్ చిన్ని శ్రీనివాస్ నెలకు రూ.4.16 లక్షలు అద్దె ఇవ్వడానికి టెండరు దక్కించుకున్నారు. 2023 ఆగస్టు 26 నుంచి 2038 ఆగస్టు 25 వరకు 15 సంవత్సరాలకు లీజ్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేశారు. రెండు అంతస్తులు మాత్రమే నిర్మాణం చేసుకోవడానికి అంగీకరించారు. నిర్మాణ పనులు చేసుకోవడానికి ఆరు నెలలు గడువు ఇచ్చి, ఆ తర్వాత అద్దె చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. స్థలం అద్దెకు తీసుకున్న డాక్టర్ శ్రీనివాస్ ఎటువంటి నిర్మాణం చేయలేదు. ఆర్టీసీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆరు నెలలు గడువు తీరిపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అద్దె చెల్లిస్తున్నారు. ఇటీవల సుమారు రూ.20 లక్షలు అద్దె బకాయిలు చెల్లించినట్టు తెలిసింది. విద్యుత్ ట్రాన్స్‌ఫారం వేయించుకోవడానికి డిపో మేనేజర్‌ని ఎన్‌వోసీ కోసం కోరగా.. ఆర్టీసీ ఎలక్ట్రికల్ డీఈఈకి దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ సూచించారు. డాక్టర్ చిన్ని శ్రీనివాసరావు మూడు రోజులుగా లీజుకు తీసుకున్న స్థలాన్ని చదును చేయించారు. గురువారం రాత్రి గ్రావెల్ మట్టితోలించారు.

పనులు మొదలు పెట్టడంపై సభాపతి ఆగ్రహం

ఆర్టీసీ స్థలంలో గ్రావెల్ మట్టి తోలిన విషయం స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి వెళ్లింది. శుక్రవారం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

శారదా నదిలో జారిపడి యువకుడి మృతి


ఆరిపాక రఘు

దేవరాపల్లి, ఆగస్టు 23: ప్రమాదవశాత్తూ శారదానదిలో జారి పడడంతో యువకుడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లిలోని రామాలయం వీధిలో నివాసం ఉంటున్న రఘు (30) ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రఘు ఆచూకీ కోసం గాలిస్తుండగా, శుక్రవారం శారదా నదిలో అతడి మృతదేహం కనిపించింది. అతడి తండ్రి అర్జున ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. అందరితో సరదాగా ఉంటే రఘు మృతి చెందడంతో రామాలయం వీధిలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..


జైసంపత్ కార్తీక్ (ఫైల్)

సబ్బవరం, ఆగస్టు 23: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలోని దేవీపురం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా వేపగుంట దరి కృష్ణరాయపురం ప్రాంతానికి చెందిన గుడిల్ల జైసంపత్ కార్తీక్ (39) సీసీ కెమారాలు బాగుచేస్తుంటాడు. శుక్రవారం ఉదయం ఎలక్ట్రికల్ స్కూటీపై వేపగుంట నుంచి అనకాపల్లి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని ఉదయం 11 గంటల సమయంలో తిరిగి వేపగుంట వెళ్తుండగా దేవీపురం సమీపంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డుపడడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో కార్తీక్ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడ్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కార్తీక్ మధ్యాహ్నం మృతి చెందాడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

సబ్బవరం, ఆగస్టు 23: మండల కేంద్రంలోని రైవాడ కాలువ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. జోడుగుళ్ల సమీపంలోని రైవాడ కాలువకు అనుకొని చెట్టు కింద సిమ్మెంట్ బళ్లపై వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే వీఆర్వో పూడి శేషుకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి 65 ఏళ్ల ఉంటాయని, బెంచీ పక్కన చెప్పులు, చేతి కర్ర, మొలకు చిన్న పంచె చుట్టి ఉందని, పోలీసులకు సమాచారం అందించామని వీఆర్వో తెలిపారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని ఉంచుతామని, బంధువులు వస్తే అప్పగిస్తామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

వంటగ్యాస్ లీకేజీతో మంటలు

» ఇంటి యజమాని అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం


సిలిండర్ నుంచి ఎగసి పడుతున్న మంటలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23: ఏఎల్‌పురం బీసీ కాలనీలో మంగళవారం వంటగ్యాస్ లీకేజ్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఏఎల్ పురం బీసీ కాలనీకి చెందిన శెట్టి రాజుబాబు ఇంట్లో అతని భార్య వరలక్ష్మి వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో రాజుబాబు అప్రమత్తమై ఇంట్లో ఉన్న రెండు సిలిండర్లను బయట పడేశారు. అయినప్పటికీ మంటలు వస్తుండడంతో పరిసరాల్లో ఉన్న వారు వచ్చి అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

అనకాపల్లి సెజ్‌లో ప్రమాదం ఘటనలో ఖమ్మం వాసి సురేంద్ర దుర్మరణం

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి సెజ్‌లో ప్రమాదం ఘటనలో అశ్వారావుపేట మండలానికి చెందిన మార్ని సురేంద్ర(37) ప్రాణాలు కోల్పోయాడు. గంగారం గ్రామానికి చెందిన సురేంద్ర చిన్నవయస్సులోనే అతని తండ్రి చనిపోయాడు. తల్లి జమున సురేంద్రను ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) వరకు చదివించింది. తొమ్మిదేళ్లుగా అతడు గాజువాకలో ఉంటూ అనకాపల్లిలోని ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి గంగారంలోనే ఉంటోంది. రోజులాగే బుధవారం కూడా పరిశ్రమకు బయల్దేరే ముందు సురేంద్ర తన తల్లికి ఫోన్‌చేసి రెండు రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పాడు. కానీ, పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం గంగారంలో సురేంద్ర అంత్యక్రియలను నిర్వహించారు.

జేబు దొంగ అరెస్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రి వద్ద మాజీ సీఎం జగన్ కార్యక్రమానికి వచ్చిన పలువురు జేబులోంచి నగదును తస్కరించిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. జగన్ కార్యక్రమంలో అందరూ ఉండగా విజయవాడకు చెందిన కట్టా బుజ్జి జేబు దొంగతనాలకు పాల్పడ్డాడని, అదే సమయంలో ఒక వ్యక్తి జేబులోంచి డబ్బులు కాజేసి పారిపోతుండగా స్థానికుల సమక్షంలో అరెస్టు చేశామని సీఐ చెప్పారు. నలుగురు తమ జేబుల్లోంచి నగదు అపహరణ చేశారని ఫిర్యాదు చేయగా, నిందితుడ్ని విచారించి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పంపిణీ


పరిహార చెక్కులు అందిస్తున్న అల్లూరి కలెక్టర్

చింతపల్లి/కొయ్యూరు, ఆగస్టు 23: కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేటు వసతి గృహంలో కలుషిత ఆహారం తిని మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ అందజేశారు. చింతపల్లిలోని అంజలి శనివారం పంచాయతీ జంగంచట్రు గ్రామానికి చెందిన కొర్ర సాధ, కిటుముల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలి జాషువ, కొయ్యూరు మండలం రెవళ్లపాలెం గ్రామానికి చెందిన గెమ్మెల భవాని మృతి చెందారు. విషయం తెలియగానే సీఎం చంద్రబాబు ఆదే రోజు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బాధిత కుటుంబీకులకు శుక్రవారం పరిహారం చెక్కులను కలెక్టర్ అందజేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ఏపీపై కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ

» అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

నక్కపల్లి, ఆగస్టు 23: ఏపీపై కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ ఉందని, రానున్న ఐదేళ్లల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ చెప్పారు. ఉపమాకలో శుక్రవారం సాయంత్రం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కేంద్రం ఇచ్చిన ఎన్నో నిధులను అప్పటి ప్రభుత్వం వాడేసిందన్నారు. ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వం పంచాయతీలకు రూ.1452 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం ద్వారా మంచినీటి కొళాయిలు కూడా వస్తాయన్నారు. నక్కపల్లి పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు అనేక ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. 15 రోజుల్లో ఎస్ఈజెడ్‌కు సంబంధించి టెండర్లు పిలుస్తామన్నారు. ఉపమాక గ్రామమంటే తనకు ఎంతో ఇష్టమని, చెప్పినట్టే తనకు, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనితకు అధిక మెజారిటీ ఇచ్చారని, ఈ గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎంపీ చెప్పారు.

అనంతరం ఉపమాక గ్రామం తరపున పెద్దలు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ వీరబాబు తదితరులు హోం మంత్రి అనితను, ఎంపీ సీఎం రమేశ్‌ను ఘనంగా సత్కరించారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


దార్లపూడిలో చిరంజీవి భార్యకు చెక్కు అందిస్తున్న దృశ్యం


బంగారమ్మపాలెంలో వెంకటసాయి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న డీటీ గణపతిరావు

ఎస్.రాయవరం, ఆగస్టు 23: అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.కోటి విలువ గల చెక్కులను శుక్రవారం అందించారు. మండలంలోని దార్లపూడి గ్రామానికి చెందిన జవ్వాది చిరంజీవి భార్య లీలాదేవికి, బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన వెంకటసాయి కుటుంబ సభ్యులకు రాంబిల్లి డీటీ ఎం.గణపతిరావు శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి స్థానిక నాయకులు, పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాషిణి, ఉప సర్పంచ్ పోలిశెట్టి శ్రీను, టీడీపీ నేతలు రాము, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థిని పరారీ యత్నం

» పాఠశాలలో ఉండడం ఇష్టం లేదంటూ వివరణ

» టీసీ ఇచ్చి తల్లిదండ్రులతో పంపేందుకు స్కూలు యాజమాన్యం నిర్ణయం



కోనాం బాలయోగి గురుకులం పాఠశాల

చీడికాడ, ఆగస్టు 23: మండలంలోని కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఇక్కడ నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించింది. సకాలంలో గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల పరిసరాల్లో బాలికను వెతికిపట్టుకొని వెనక్కు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కోనాం గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ సుమారు 550 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం అటెండెన్స్ వేస్తుండగా 6వ తరతగతికి చెందిన ఓ విద్యార్థిని కనిపించలేదు. దీంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆందోళన గురయ్యారు. వెంటనే పాఠశాల పరిసరాల్లో వెతగ్గా, సమీపంలోని హైలెవెల్ కాలువ వద్ద గల తుప్పల్లో బాలిక కనిపించింది. దీంతో ఆ బాలికను వెనక్కు తీసుకొచ్చారు.

ఈ విషయమై ప్రిన్సిపాల్ హిమాచల్‌ను విలేకరులు అడగ్గా, 6వ తరగతి చదువుతున్న ఓ బాలిక పాఠశాలలో ఉండడం ఇష్టం పడక ఇంటికి వెళ్లిపోయే ఉద్దేశంతో ఇక్కడ నుంచి తప్పించుకునేందుకు యత్నించిందన్నారు. ఈ విషయమై గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అలాగే ఆ బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు వచ్చిన వెంటనే టీసీ ఇచ్చి వారితో బాలికను ఇంటికి పంపించి వేయనున్నట్టు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


సత్యవేణి (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, ఆగస్టు 23 : మండలంలోని తాటిపర్తి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సతక సత్యవేణి(13) శుక్రవారం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు మండలం ఐనాడ పంచాయతీ సీకుపనస గ్రామానికి చెందిన సతక లక్ష్మణ్, ఈశ్వరమ్మలకు ముగ్గురు సంతానం. వీరిలో మొదటి సంతానం సత్యవేణి, తర్వాత ఇద్దరు కుమారులు. సత్యవేణి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. దీంతో ఫిబ్రవరి నుంచి పాఠశాలకు రాలేదు. ఈ ఏడాది జూన్ నెలలో పాఠశాలకు వచ్చి గుండెకు ఆపరేషన్ చేయించుకునేందుకు పాఠశాల హెచ్‌ఎం రమాదేవి వద్ద పర్మిషన్ తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో జూన్ నెలలో విశాఖపట్నంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో గుండెకు శస్త్ర చికిత్స చేసి వైద్య సేవలు అందించి స్వగ్రామం పంపించారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే మందులు వాడుతున్నది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురై సత్యవేణి మృతి చెందింది. సత్యవేణి చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పాఠశాల హెచ్‌ఎం, మేట్రిన్, ఉపాధ్యాయ సిబ్బంది సత్యవేణి మృతదేహానికి నివాళులు అర్పించి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టంగుటూరికి ఘన నివాళి


కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న అధికారులు

తుమ్మపాల, ఆగస్టు 23: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధితో పాటు అధికారులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ టంగుటూరి నిజాయితీ, నైతిక విలువలతో కూడిన జీవనశైలి నేటి యువత, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకమన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ సిబ్బందితో కలిసి టంగుటూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. టంగుటూరి గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఇన్‌స్పెక్టర్లు కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, బి.శారదా, బి.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

గన్‌తో బెదిరించి బైక్ అపహరణ

అంతర్రాష్ట్ర దొంగలుగా అనుమానం

నెల రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాల చోరీ


దొంగలు అపహరించిన బైక్ ఇదే.. (ఫైల్)

ముంచంగిపుట్టు, ఆగస్టు 23: మండలంలోని మారుమూల గ్రామంలో శుక్రవారం సచివాలయం ఉద్యోగిని ఆగంతుకులు పిస్టల్‌తో బెదిరించి బైక్ అపహరించుకుపోయారు. రంగబయలు, వనుగుమ్మ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలకు హాజరైన వనుగుమ్మ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెయ్యల పురుషోత్తం స్వగ్రామం లక్ష్మీపురానికి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని బరడ, లబ్బూరు సమీపంలో డైనిజోల్లా ఘాట్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పురుషోత్తంను ఆపారు. తుపాకీ (పిస్టల్)ని చూపించి బెదిరించి అతని వద్ద ద్విచక్ర వాహనం (పల్సర్)ను లాక్కొని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని బాధితుడు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. అయితే దొంగలు అపహరించిన ద్విచక్ర వాహనం సంగడ జలాశయం వంతెన మీదుగా ఒడిశా ఒనకడిల్లీ వైపు వెళ్లినట్టు తెలిసింది. వాహనాన్ని ఎత్తుకుపోయిన తీరును చూస్తుంటే అంతర్రాష్ట్ర దొంగలు పనై ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని బాధితుడు స్థానిక పోలీసులకు తెలియజేశారు.

మండల కేంద్రంలో గత మంగళవారం ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయం మరవక ముందే మరో వాహనం చోరీకి గురైంది. అలాగే నెల క్రితం మండల కేంద్రంలో ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయం తెలిసిందే. సంఘటనలు మరవక ముందు తుపాకీతో బెదిరించి మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకుపోవడంతో మండల వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో సైతం మాకవరం గ్రామంలో తుపాకులతో రాత్రి వేళ ఒక ఇంటిలోకి దుండగులు ప్రవేశించి లూటీ చేసిన విషయం తెలిసిందే. దొంగతనాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పీపుల్స్ చాయిస్ టైటిల్ విన్నర్‌గా శిరీష


నిర్వాహకుల నుంచి టైటిల్ అందుకుంటున్న శిరీష

నాతవరం, ఆగస్టు 23: హైదరాబాద్‌కు చెందిన మాంటి ప్రొడక్షన్ సంస్థ నిర్వహించిన మిస్టర్ అండ్ మిస్ గార్డియస్ ఆఫ్ ఇండియా పోటీలో మండల కేంద్రానికి చెందిన యువతి ఎం.శిరీష టైటిల్ విన్నర్‌గా నిలిచింది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చేయూత ఇచ్చే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలో విన్నర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉందని శిరీష తెలిపారు.

సింహాద్రికి సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సింహాద్రి సీజీఎం

పరవాడ, ఆగస్టు 23: సింహాద్రి ఎన్టీపీసీకి సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు దక్కింది. గిరిజన ప్రాంతాల్లో విద్యను అభివృద్ధి చేయడంలో కృషి చేసినందుకు సింహాద్రి ఎన్టీపీసీ ఈ అవార్డుకు ఎంపికైంది. 11వ జాతీయ సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు ప్రదానోత్సవం శుక్రవారం గోవా రాజధాని పనాజీలో ఏర్పాటు చేశారు. గోవా రాజ్యసభ సభ్యుడు సదానందతన్‌వాడే చేతుల మీదుగా సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ టైమ్స్ ఎడిటర్ హరీశ్‌చంద్ర, జ్యూరీ సభ్యుడు భాస్కర్ చటర్జీ పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత రిటైర్‌మెంట్

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), ఆగస్టు 23: ఐదేళ్ల తర్వాత రాజకీయాల నుంచి తాను రిటైర్‌మెంట్ తీసుకుంటానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామాన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల ముందే రిటైర్‌మెంట్ తీసుకుంటానని స్పష్టం చేశారు.

నెహ్రూచౌక్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

» జగన్ రాకతో గంటకుపైగా నిలిచిపోయిన వాహనాలు


రహదారిపై నిరీక్షిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ క్షతగాత్రులను పరామర్శించేందుకు స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రికి శుక్రవారం రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బైపాస్ నుంచి నెహ్రూచౌక్‌కు వచ్చే రోడ్డులో సుమారు గంటకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నెహ్రూచౌక్, ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు సత్యసాయి మందిరం మీదుగా వెళ్లారు. ట్రాఫిక్ సమస్యను ముందుగా గ్రహించిన పీటీడీ అధికారులు విశాఖ, విజయనగరం వైపు వెళ్లే బస్సులను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు. అయితే ఆ బస్సులు పట్టణంలోకి రాకపోవడంతో నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్, బాలకృష్ణ బస్టాప్ వద్ద విశాఖ, విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జేబు దొంగల హల్‌చల్....

వైఎస్ జగన్‌ను కలిసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులతో ఉషాప్రైమ్ ఆస్పత్రి ఎదుట రద్దీ పెరిగింది. ఇదే అదునుగా జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. పలువురు జేబుల్లోని నగదును అపహరించుకుపోయారు. సుమారు రూ.50 వేలకుపైగా జేబుదొంగలు పలువురు జేబుల్లోంచి కాజేసినట్టు తెలిసింది. వైసీపీకి చెందిన ముఖ్య నేత జేబు నుంచి కూడా నగదును తస్కరించినట్టు సమాచారం. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

అనకాపల్లి డీఎస్పీగా శ్రావణి బాధ్యతలు



అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: అనకాపల్లి డీఎస్పీగా ఎం.శ్రావణి గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇంటిలిజెన్సీ విభాగం నుంచి ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీల్లో అనకాపల్లికి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎస్.అప్పలరాజును పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జనసేన నేతలు

సబ్బవరం, ఆగస్టు 23: మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్రికెట్ కప్-2024 పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలను జనసేన సీనియర్ నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బలిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. టీర్న విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు, ఇతర కన్సోలేషన్ బహుమతులను వచ్చే నెల 2న అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి ముత్యాలనాయుడు, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారేష్


కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మారేష్

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 23: మండలంలోని మెట్టదర్మవరం గ్రామానికి చెందిన పెంకే మారేష్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. తనకు అందించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, బీసీ సంఘాన్ని బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.


అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు


అనకాపల్లి మండలం కూండ్రం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


అనకాపల్లి మండలం గొలగాం గ్రామ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు


ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామ సభలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

పల్లె ప్రగతికి కంకణం

» గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం » పంచాయతీల వికాసానికి కట్టుబడి ఉన్న కూటమి సర్కారు » గ్రామ సభల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు

కశింకోట, ఆగస్టు 23 : వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథాన నడిపిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి మరింత చేరువ చేయాలని గ్రామస్థులు కోరారు. నర్సీపట్నం రోడ్డులో డ్రైనేజీలు నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో అసంపూర్తిగా నిలిచి పోయిన పనులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నేతలు కర్రి సత్యనారాయణ, కాయల మురళీ, పొన్నగంటి అప్పారావు, నైనంశెట్టి రమణారావు, సర్పంచ్ రెల్లి నాగయ్యమ్మ, ఉల్లింగల రమేష్, గల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం అనకాపల్లి మండలం కూండ్రంలో జరిగిన గ్రామ సభకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి హాజరై మాట్లాడారు. మొదటి విడతగా అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న అనకాపల్లి, కశింకోట మండలాల్లో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు రూ.13కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఏపీడీ మణికుమార్, డీఎల్‌పీవో మంజులావాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, కూండ్రం సర్పంచ్ నందారపు లక్ష్మి, కూటమి నేతలు నందారపు సూరిబాబు, పచ్చికూర రాము, మరపురెడ్డి సత్యనారాయణ, సేనాపతి స్వరూప, ఎంపీటీసీ జెట్టి సత్యవతి తదితర కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. అనకాపల్లి మండలం గొలగాంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని వాపోయారు. సర్పంచ్ సలపురెడ్డి నాగ నరసింహారావు, కూటమి నేతలు నారపిన్ని చంద్రశేఖర్, తలారి కాశీనాయుడు, గొర్లి ప్రసాద్, మారిశెట్టి భాస్కరరావు, గుణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట/రూరల్ : మండలంలో గ్రామ సభలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పాయకరావుపేటలో సర్పంచ్ గారా ఉషశ్రీ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు హాజరైన ప్రజలు పట్టణంలో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, పశువుల సంచారం, కుక్కలు, పందులు, కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతి పత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, జగతా శ్రీను, జనసేన, బీజేపీ నాయకులు ఆచంట దొర, వేముల వెంకటేశ్వరరావు, కువల కుమార్, పంచాయతీ కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పెంటకోటలో జరిగిన గ్రామ సభలో జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పంచాయతీల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రామసభలు ప్రశాంతంగా జరిగాయి. మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ సీహెచ్‌బీ అగ్రహారం, నక్కపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామసభలను పర్యవేక్షించారు. ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏవో డి.సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ బి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ నాగభూషణం, ఎంఈవో కె.నరేశ్, ఉపాధి పథకం ఏపీవో భాగ్యలక్ష్మి, ఏవో కె.ఉమా ప్రసాద్ నేతృత్వంలోని అధికారులు పలు గ్రామాల్లో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించారు. గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.


కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్


సబ్బవరంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

ఎస్.రాయవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో సభలు ప్రశాంతంగా జరిగాయి. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్ల సమక్షంలో జరిగిన ఈ సభల్లో ఆయా గ్రామాలకు చెందిన పలువురు సమస్యలను వివరించారు. ధర్మవరం అగ్రహారం సచివాలయం వద్ద జరిగిన సభలో గ్రామంలో చేపట్టాల్సిన పనులపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు పలువురితో కలిసి ప్రత్యేక అధికారికి, కార్యదర్శికి, సర్పంచ్ కలిగట్ల మాణిక్యంకు వినతి పత్రాలు అందజేశారు. కొరుప్రోలు సభలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన పలు సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఏపీవో సత్యవతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కోటవురట్ల : పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని 25 గ్రామ పంచాయతీలతో పాటు మండల కేంద్రం కోటవురట్లలో గ్రామ సభ జరిగింది. ఈ సభలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్డీ స్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీను, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీలు పి.సూర్యారావు, వంగలపూడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : గ్రామాల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్టు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. స్వల్ప ఉద్రిక్తతల నడుమ మండలంలోని దిబ్బపాలెం సెజ్ పునరావాస కాలనీలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టి వరకూ తీసుకురాకుండా, వీలైనంత వరకూ గ్రామ పంచాయతీ బాధ్యులుగా ఉన్నవారు పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి స్పోర్ట్స్ హబ్, పాలిటెక్నిక్ కళాశాల వంటివి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అతిపెద్ద పంచాయతీ అయిన దిబ్బపాలెంలో 26 గ్రామాలు ఉన్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కుక్కల బెడదపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానన్నారు. గ్రామంలోని కొందరు సమస్యలపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న సమయంలో స్థానిక నాయకులు వారితో వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే సంయమనంతో వారి సమాధానం చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. బైలపూడి రామదాసు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సర్పంచ్‌లు శాంతికుమారి, బైలపూడి భవాని, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, ఎంపీటీసీ నర్సింగరావు, వీఆర్ జీఈ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : గ్రామాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఏటికొప్పాకలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలకులు పంచాయతీలను నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కంకణం కట్టుకుందన్నారు. ఎంపీడీవో అప్పలనాయుడు, పీఆర్ జేఈ సోమశేఖర్, సోమరాజు, సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, కార్యదర్శి ప్రసాద్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, ఉప సర్పంచ్ కర్రి సింహాచలం, నేతలు అన్నం బాబ్జీ, పూడి రామ కృష్ణ స్థానిక నేతలు పాల్గొన్నారు. జంపపాలెంలో నిర్వహించిన గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి చాముండేశ్వరావు పాల్గొన్నారు. అలాగే, అన్ని గ్రామాల్లో ఈ సభలు జరిగాయి.

రాంబిల్లి : గ్రామ సభలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ఆయా పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన సభల్లో ప్రజలు సమస్యలను వివరించారు. చినకలవలాపల్లిలో జరిగిన సభలో సర్పంచ్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సంస్థలకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ సభల్లో ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. మేజరు పంచాయతీ పరవాడ గ్రామసభలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, నోడల్ అధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాల సుస్థిర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మేజరు పంచాయతీ సబ్బవరం గ్రామ సభను ఎమ్మెల్యే పంచకర్ల, మొగలిపురం గ్రామ సభను పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అంటే వంద శాతం ప్రజల అవసరాలను తీర్చేదిగా వారు పేర్కొన్నారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఈవోపీఆర్‌డీ మహేశ్, సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, గండి అరుణ, ఉప సర్పంచ్ లక్ష్మణ, ఎంపీటీసీలు బి.దేముడుబాబు, చైతన్య, టి.దేముడమ్మ, ఎంఈవో మూర్తి, కార్యదర్శి మూర్తిబాబు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రసాభాసగా తుమ్మపాల గ్రామసభ

తుమ్మపాల : మేజరు పంచాయతీ తుమ్మపాలలో శుక్రవారం జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. పంచాయతీ కార్యదర్శి పాలకవర్గానికి అందజేసిన సర్క్యులర్‌లో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు పేరును కొంత మంది కూటమి నాయకులు కొట్టివేసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో అసహనానికి గురైన సర్పంచ్ గ్రామ సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిని కూటమి నాయకులు తిప్పికొట్టారు. కూటమి రాష్ట్ర నాయకుల పేర్లు లేకుండా సర్క్యులర్ ఏమిటని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్ది సేపు సభలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసులు నచ్చజెప్పడంతో సద్దుమణిగింది. అనంతరం యథాతథంగా సభ సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'ఏఎంఏఏ'లో పూర్వ విద్యార్థులు కలయిక



విద్యార్థినికి జ్ఞాపిక బహుకరిస్తున్న పూర్వపు విద్యార్థులు

కొత్తూరు, ఆగస్టు 23 : స్థానిక ఏఎంఏఏ హైస్కూలులో 1972లో పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల శుక్రవారం కలుసుకున్నారు. దీంతో పాఠశాలలో కోలాహల వాతావరణం నెలకొంది. అదే బ్యాచ్‌లో విద్యనభ్యసించిన ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి లావణ్య డాక్టర్ దక్షిణామూర్తి, గుర్రం ప్రసాద్, కేవీపీ రమణయ్య వామాల కోటేశ్వరరావు, నళినీకాంత్, రాజేశ్వర ప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీనాయుడు జన్మదిన వేడుకలు


జల్లూరులో కేక్ కట్ చేస్తున్న జనార్దన్, లింగంనాయుడు

కోటవురట్ల, ఆగస్టు 23 : టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండలంలోని జల్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల సీనియర్ నేత వేచలపు జనార్దన్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగం నాయుడులు కాశీనాయుడు జన్మదిన కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాజుపేట గ్రామ సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, గంగాధర్ శ్రీనివాస్, బోడపాలెం నానిబాబు, పైలా శ్రీనివాసరావు, రమణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌కు మతిభ్రమించింది : ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ప్రభుత్వం కంపెనీ ప్రతినిధుల ద్వారా పరిహారం చెల్లించినా మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. శుక్రవారం అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. అచ్యుతాపురం ప్రమాద సంఘటనపై రాష్ట్రప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదన్న జగన్ వ్యాఖ్యలను ఖండించారు. ప్రమాదంలో చనిపోయిన 17 మందికి చెక్కులు అందించినా, రాజకీయ లబ్ధి కోసం జగన్ ధర్నా చేస్తానని అంటున్నాడని, అటువంటి ధర్నాలకు భయపడేది లేదన్నారు. కంపెనీలో ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా కలెక్టరు, ఎస్పీతో సహా జిల్లాలో ఇతర శాఖల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టడం జగన్‌కు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కళ్లుండి చూడలేని విధంగా జగన్ మాట్లాడు తున్నాడని విమర్శించారు. వైసీపీ హయాంలో గోపాలపట్నంలో ఎల్‌జీ పాలీ మార్ కంపెనీలో ప్రమాదం జరిగితే సీఎంగా తాను ఎంతగానో స్పందించానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పట్లో ఆయన కనీసం సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లలేదన్నారు. కేవలం విమానాశ్రయంలో చర్చలు జరిపి వెళ్లిపోలేదా అన్ని ప్రశ్నించారు. విపత్తులు, ప్రమాదాలు జరిగిన సందర్భంలో సీఎం చంద్రబాబునాయుడు స్పందించిన తీరు ఏవిధంగా ఉంటుందో దేశం మొత్తానికి తెలుసునన్నారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జగన్‌కు మొన్నటి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా మారలేదన్నారు. ఇదే పంథా కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి ఉండద న్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, ముత్యాల పాప, టీడీపీ నేతలు దాడి రత్నాకర్, కోట్ని బాలాజీ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

క్షతగాత్రులను పరామర్శించిన 'సుందరపు'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 : అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యాన్ని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

'పేట' జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి

పాయకరావుపేట, ఆగస్టు 23 : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవిశంకర్ నాయక్ ఆకస్మికంగా మృతిచెందారు. గురువారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

'సినర్జిన్'లో ప్రమాదంపై విచారణ జరపాలి

పరవాడ, ఆగస్టు 23 : ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యూనిట్ -3లో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

పూడికతీతలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

» జోనల్ కమిషనర్‌కు కూటమి నాయకుల వినతి


జడ్సీకి వినతిపత్రం అందిస్తున్న జోగినాయుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోజూట కాలువల్లో పూడిక తీతల్లో జరిగిన అవకతవకలపై తగిన చర్యలు తీసుకోవాలని 80వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. కాలువల్లో పూడిక తీత పూర్తిస్థాయిలో జరగనప్పటికీ సంబంధిత అధికారులు జరిగినట్టు చూపిస్తున్నారని, వాస్తవానికి కాలువలన్నీ పరిశీలిస్తే అక్కడకక్కడ మాత్రమే పూడికలు తీశారని వివరించారు. దీంతో పంట కాలువల్లో నీరు సరిగా పారక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సుమారు రూ.80 లక్షలతో ఈ పనులు చేపట్టినట్టు చూపించి భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దూలం ప్రసాద్, బుద్ద శ్రీనివాసరావు, ఆళ్ల కోటేశ్వరరావు, సూరిశెట్టి రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ లక్ష్మీ పూజలు


నూకాంబిక ఆలయంలో మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అనకాపల్లి టౌన్/నక్కపల్లి, ఆగస్టు 23 : శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయ మండపంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే, అన్ని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా నక్కపల్లి మండలం ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మాఢవీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి తిరువీధుల్లో మంగళవాద్యాలు, సన్నాయి మేళాలతో ఊరేగింపు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'వినాయక ఘాట్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దండి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 : వచ్చే నెలలో వినాయక చవితి జరగనున్న సందర్భంగా నవరాత్రులు పూర్తయ్యే వరకు శారదానది ఒడ్డున గల నిమజ్జన ఘాట్‌ను అభివృద్ధిపరచాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి శుక్రవారం జోనల్ కమిషనర్‌ను కోరారు. వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవాలు జరిగే వరకు శానిటేషన్, లైటింగ్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు.

జగన్ పాలనలో పీఆర్ వ్యవస్థ నిర్వీర్యం

... 5వ పేజీ తరువాయి

అనిత ఉపమాకలో మంచినీటి సమస్యతోపాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి వైసీపీ సర్పంచులు తీర్మానాలు చేయకపోతే వారే నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో డుమా పీడీ సందీప్, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి కొండబాబు, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, అబద్దం, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన...

... 5వ పేజీ తరువాయి

మృతి చెందిన 17 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున చెక్కులు అందించామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో చిన్నికృష్ణ, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్, డీటీ శ్రీరామ్మూర్తి, డాక్టర్ అవినాష్, అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఉన్నారు.

ఆర్టీసీ స్థలంపై మరోసారి రాజుకున్న వివాదం

... 5వ పేజీ తరువాయి

ఆయన స్థలం పరిశీలించడానికి డిపో ఆవరణలోకి వచ్చారు. ప్రభుత్వ స్థలంలో మట్టి తోలుతుంటే డిపో మేనేజర్, సెక్యూరిటీ గార్డులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డిపోలోకి లారీలను ఎలా రానిచ్చారని డిపో మేనేజర్‌పై మండి పడ్డారు. లీజుదారుడితో ఆర్టీసీ అధికారులు కుమ్మక్కయ్యారని విమర్శించారు. సీసీ పుటేజీలు ఆధారంగా గ్రావెల్ మట్టి తోలిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీని మీద అసెంబ్లీలో చర్చకు పెడతానని హెచ్చరించారు. ఈ ఖాళీ స్థలంలో రెండో ఫ్లాట్‌ఫారం నిర్మించాలన్నారు. స్పీకర్ వెంట కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, టీడీపీ నాయకులు ఉన్నారు.

వందలాది మందికి ఉపాధి

ఆర్టీసీ స్థలం 15 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నామని, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందని డాక్టర్ చిన్ని శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ టెండర్లు ఆహ్వానిస్తే పాల్గొని 15 సంవత్సరాలు లీజుకి తీసుకున్నానని తెలిపారు. జీఎస్టీతో కలుపుకొని నెలకు సుమారు రూ.5లక్షలు అద్దె చెల్లిస్తున్నానన్నారు. **- లీజుదారుడు చిన్ని శ్రీనివాసరావు**

కార్మికులతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ఆరు నెలలు శిక్షణ అందిస్తాయి. ఆ తరువాత కూడా ఉత్పత్తి మారిన ప్రతిసారీ శిక్షణ ఇస్తుంటారు. అదే మధ్య, చిన్నతరహా కంపెనీల్లో ఫ్రెషర్స్‌ను తీసుకున్నా శిక్షణ ఉండదు. రియాక్టర్‌లో ముడిసరకులు, తరువాత సాల్వెంట్ కలిపి ప్రాసెస్ చేసేటప్పుడు ఒక ఫార్ములా ఉంటుంది. ఉదాహరణకు రియాక్టర్‌లో 100 కిలోల ముడిసరుకు వేసి ఉత్పత్తి చేయాలనుకుంటే కచ్చితంగా అంతే పరిమాణం వాడాలి.. అంతకు మించి వేస్తే ఇబ్బందులు వస్తాయి. అటువంటప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి, ఆవిరి ప్రమాణాలు పెరిగిపోతాయి. ఎక్కువ ప్రమాదాలు జరగడానికి ఇలాంటి ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. రియాక్టర్ నుంచి సాల్వెంట్ డ్రమ్ముల్లోకి పంపి అక్కడ ఫిల్టర్ చేస్తుంటారు. తరువాత డ్రయ్యర్ విధానంలో పొడిచేసి ప్యాకింగ్ చేస్తారు. ఈ విధానం మొత్తం పూర్తయ్యేవరకు సీనియర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నిచోట్ల సీనియర్ల కొరతతో జూనియర్లతో ప్రాసెసింగ్ చేస్తున్నారని బలరామ్‌నాయుడు అనే కెమికల్ ఇంజనీరు అభిప్రాయపడ్డారు. రియాక్టర్‌లో ముడిసరుకు, సాల్వెంట్ వేసిన తరువాత ప్రాసెసింగ్‌కు టైమ్ ఖరారుచేస్తారని, ఈ మధ్యలో తేడా వస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ విధానం అమలుచేసి సమస్య పరిష్కరించే అనుభవజ్ఞుల కొరత ఉందని, ఇందుకు కాస్ట్ కటింగ్స్ (తక్కువ వేతనాలు) విధానం అమలుచేస్తుంటారని ఆరోపించారు. ఇదిలావుండగా ఫార్మా, కెమికల్ కర్మాగారాల్లో ఉద్యోగులకు పక్కాగా శిక్షణ అవసరమని ఏయూ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య సిద్ధయ్య అభిప్రాయపడ్డారు. మిగిలిన రంగాలకు భిన్నంగా ఈ కంపెనీల్లో పనిచేయాలంటే ఆయా కెమికల్స్‌పై అవగాహన అవసరమన్నారు. అయితే ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం శిక్షణ ఇచ్చిన తరువాతే విధుల్లోకి తీసుకుంటాయన్నారు.

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

... 5వ పేజీ తరువాయి

బయటకు వెళ్లే మార్గం లేక ఒత్తిడి పెరిగింది. కేబుల్ డక్ట్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం వ్యాపించింది. దీనికి కొంత సమయం పడుతుంది. అప్పటివరకు గదిలో పొగ, వాసన విషయాన్ని సెన్సార్లు పసిగట్టి అలారం మోగాలి. అలారం మోగిందా? సెన్సార్లు ఉన్నాయా? ఒకవేళ ఉండీ పనిచేయడంలేదా? మోగినా పనిలో ఉన్న వారు గుర్తించలేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెన్సార్లు మోగకుంటే మరేదైనా కారణంతో ప్రమాదం జరిగిందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది. రియాక్టర్‌ల నుంచి సాల్వెంట్ డ్రమ్ములోకి పంపేటపుడు పైపులు లీకైనా వెంటనే సెన్సార్లు అప్రమత్తంచేస్తాయి. మూడో అంతస్తులోనూ సెన్సార్లు ఏర్పాటుచేయలేదా? అని ఇంజనీరింగ్ నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా కర్మాగారంలో పీరియాడికల్‌గా తనిఖీలు చేయకపోవడంతోనే ఎసెన్షియాలో ప్రమాదం జరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. ఉత్పత్తులకు తగిన విధంగా కర్మాగారం సిద్ధంగా లేకపోతే అనుమతులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. తాజా ఘటన నేపథ్యంలో కర్మాగారంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సూచిస్తున్నారు. ఎసెన్షియా కంపెనీ ఘటనతో ఉమ్మడి జిల్లాలో అన్ని కర్మాగారాల్లో సెన్సార్లు, ఇతర పరికరాలు ఉన్నాయా? అన్నది సంబంధిత అధికారులు తనిఖీలు చేసి, అవి సక్రమంగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి

» చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 23 : రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక అవసరాలకు సంబంధించిన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటిని గ్రామసభల ద్వారా పరిష్కరించుకునేలా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ పంచాయతీగా చోడవరం

తాను పుట్టి పెరిగిన చోడవరం పంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఈ పట్టణంలో సీసీ రోడ్లు, ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం వంటివి చేపట్టనున్నామన్నారు. సమస్యల రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా స్థానికంగా వివిధ పంచాయతీలకు చెందిన సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుని రాగా, అధికారులు వాటిని నమోదు చేసుకున్నారు. ఈ గ్రామసభలో సర్పంచ్ బండి నూకరత్నం, ఈవో నారాయణరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, పంచాయతీ వార్డు సభ్యులు స్థానిక టీడీపీ నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, మెంబరు శ్రీను పాల్గొన్నారు.

చెట్టుపల్లి జడ్పీహెచ్ స్కూలు సందర్శించిన డీవైఈవో



విద్యార్థులు, టీచర్లకు సూచలిస్తున్న డీవైఈవో అప్పారావు

నర్సీపట్నం, ఆగస్టు 15 : మండలంలోని చెట్టుపల్లి జెడ్పీ హెచ్ పాఠశాలను ఎలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల బోధన, నోట్ పుస్తకాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణారావు పాల్గొన్నారు.

'ఆంధ్రకేసరి'కి ఘన నివాళి



ప్రకాశం పంతులుకు నివాళి అర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం, ఆగస్టు 23 : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్ర వారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు దస్త్రాల రాఘవేంద్రరావు, విశ్రాంత ఎంఈవో నాగేశ్వరావు, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. గజ్జాలమ్మ, హెచ్ఎం ఎంఎస్ ప్రసాద్ ఎన్టీఆర్ మిని స్టేడియంలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎంవీ రంగారావు, ట్రెజరర్ అల్లు అప్పారావు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని అనాథ ఆశ్రయాలను మూసివేయాలి

నర్సీపట్నం, ఆగస్టు 23 : రాష్ట్రంలో గుర్తింపు లేని అనాథ ఆశ్రమాలను మూసి వేయాలని సెబ్సా రాష్ట్ర అధ్యక్షుడు శివనారాయణరాజు ఆర్డీవో జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేని అనాథ ఆశ్రమాలు, హాస్టళ్లు మూయించడానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి

» శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



గ్రామసభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, ఆగస్టు 23 : గ్రామాల అభివృద్ధికి ప్రతి శాఖలోని అధికారులు సహకరించాలని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శుక్రవారం మాకవరపాలెం సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, గ్రామాల వికాసానికి కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామ సభల్లో 87 అభివృద్ధి పనులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీనివల్ల గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, సాగునీటి కాలువలు వంటి మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి గ్రామ సభలో పనులు జాబితాలను ప్రకటించారు. అనంతరం సర్పంచ్ అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ గ్రామసభల నిర్వహణ పంచాయతీలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, డీఎల్పీవో మూర్తి, మాజీ జడ్పీటీసీ రుత్తల శేషు కుమార్, నేతలు అర్‌వై పాత్రుడు, అల్లు రామునాయుడు బోడ్డు రాము, చింతల శర్మ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

» మాడుగుల ఎమ్మెల్యే బండారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, ఆగస్టు 23 : కె.కోటపాడు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. ఇందులో భాగంగా కొరువాడలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన అనేక అభివృద్ధి పనులకు అంగీకారం తెలిపి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రతి పని పారదర్శకంగా చేపట్టనున్నట్టు చెప్పారు. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారని, బ్లీచింగ్ కొనాలన్నా పంచాయతీలలో ఒక నయా పైసా లేకుండా చేశారని విమర్శించారు. మండలంలో రైతులకు ఎంతో అవసరమైన మార్కెట్ యార్డును చేపడతామన్నారు. ఇంతకు ముందు గ్రామానికి కావాల్సిన పనులను గుర్తించి గ్రామసభలో తీర్మానించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తంచేశారు. కొరువాడ పాఠశాల నుంచి ఎంపికైన జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడా విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎస్. అప్పలరాజు, సభ సూపర్‌వైజర్ డాక్టర్ నాయుడు, పాఠశాల హెచ్ఎం కె.కమలాకుమారి, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, ఎంపీటీసీ చీపురుపల్లి అచ్చిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు చీపురుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో పంచాయతీలకు పూర్వ వైభవం

పలు చోట్ల నిర్వహించిన సమావేశాల్లో వక్తలు



కృష్ణాదేవిపేట : ఏఎల్‌పురంలో గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు



దేవరాపల్లి : కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న గొర్లె వారి కళ్లాల రైతులు

గొలుగొండ, ఆగస్టు 23 : మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించిన అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గొలుగొండ, పాకలపాడు, పాతమల్లంపేట, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం, గుండుపాల, జోగంపేట, ఏటిగైరంపేట, రావణాపల్లి, పుత్తడిగైరంపేట గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. చీడిగుమ్మల గ్రామ సభలో మండల ప్రత్యేకాధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డేవిడ్‌రాజ్, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, పలు గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని కోనాంలో జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభను శుక్రవారం ఎంపీడీవో జయప్రకాశరావు, జేబీ పురంలో ఈవోపీఆర్డీ కామేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు గ్రామాల్లోనూ గ్రామసభలు జరిగాయి. కోనాంలో సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, జేబీ పురంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, చీడికాడలో గాలి రావాలమ్మ, చుక్కపల్లిలో మజ్జి లక్ష్మణమ్మ, తురువోలులో మట్టా అప్పారావు తదితర అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసర్పంచ్‌లు అధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సన్యాసిరావు, నాగేశ్వరరావు, వీర్రాజు, పట్నాల గోపి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర చోట్ల గ్రామ సభలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంపీడీవో డేవిడ్‌రాజు, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీలు రుత్తల రామకృష్ణ, చింతల బుల్లిప్రసాద్, మాజీ జడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్, స్థానిక హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, ఉపసర్పంచ్ లంక సత్యనారాయణ, కార్యదర్శులు రాజేశ్, సాంబశివ, సచివాలయ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో 31 పంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలు నిర్వహించినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. లచ్చన్నపాలెం గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామ సభలోనే పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. మొత్తం 87 రకాల పనులు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతల రామలక్ష్మి, సీనియర్ టీడీపీ నేతలు పోతల రాంబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక సంత తోటలో ప్రభుత్వ స్థలంలో తాము చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గొర్లె వారి కళ్లాలకు చెందిన కొందరు కోరారు. శుక్రవారం దేవరాపల్లిలో జరిగిన గ్రామ సభలో సచివాలయ కార్యదర్శి రత్నంకు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందచేశారు. పలు గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో తాగునీరు, రోడ్లు నిర్మాణం చేపట్టాలని జాబ్ కార్డులు ఇచ్చి పనులు కల్పించాలని కోరారు.



గొలుగొండ : చీడిగుమ్మల గ్రామ సభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 23 : ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. శుక్రవారం వడ్డాదిలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మానవీయ కోణంలో ప్రజలకు సేవలు అందించాలని, ప్రజా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించి, సామాన్య ప్రజలకు ఎప్పుడూ అండగా తమ ప్రభుత్వం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రైతులకు, స్థానికులకు ఉపయోగపడే పనులకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, ఎంపీడీవో సువర్ణ రాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవో లవరాజు, ఏపీవో మురళీ, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, కూటమి నేతలు దొండా సురేష్, అడపా నర్సింహమూర్తి, శిరిగిరిశెట్టి చినవెంకయ్య దొర, దూది రాజేష్, దొండా గిరిబాబు, రామూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థి అనారోగ్యం.. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం

» కుక్‌కు లీవ్ లెటర్ ఇచ్చి ఇంటికి బయలుదేరిన బాలుడు

» డబ్బులు లేకపోవడంతో కాలినడకన ప్రయాణం



కాలినడకన ఇంటికి వెళుతున్న బాలుడు శివకుమార్

చీడికాడ, ఆగస్టు 23 : మండలంలోని అప్పలరాజుపురం బీసీ బాలుర వసతి గృహం సిబ్బంది విద్యార్థుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అనారోగ్యానికి గురైన ఓ విద్యార్థి విషయంలో వీరు నిర్లక్ష్య ధోరణి బహిర్గతమైంది.

కోనాం శివారు గుంటుకొత్తూరు గ్రామానికి చెందిన కోట శివ కుమార్.. అప్పలరాజుపురం బీసీ బాలుర వసతిగృహంలో 7వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి అనారోగ్యంగా ఉందని రూమ్‌లో నిద్ర పోయాడు. రాత్రి 7 గంటలకు భోజనాలు చేసే ముందు ప్రార్థన కు రాకపోవడంతో శివకుమార్ పడుకున్న గదికి ఫుడ్‌లీడర్ వచ్చి ఏమైందంటూ ఆరా తీశాడు. తనకు ఒంట్లో బాగా లేదని చెప్పినా వినిపించుకోకుండా శివకుమార్ చెవిపై ఫుడ్ లీడర్ కొట్టాడు. దీంతో శివకుమార్‌కు చెవి నొప్పి మొదలై శుక్రవారం ఉదయానికి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శివకుమార్ హాస్టల్ కుక్ లక్ష్మికి లీవ్ లెటర్ అందించి ఇంటికి బయలుదేరాడు. అయితే శివకుమార్ వద్ద డబ్బులు లేకపోవడంతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి కాలినడకన వెళ్లాడు. విద్యార్థుల బాగోగులు చూసే విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కార్మికులతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ఆరు నెలలు శిక్షణ అందిస్తాయి. ఆ తరువాత కూడా ఉత్పత్తి మారిన ప్రతిసారీ శిక్షణ ఇస్తుంటారు. అదే మధ్య, చిన్నతరహా కంపెనీల్లో ఫ్రెషర్స్‌ను తీసుకున్నా శిక్షణ ఉండదు. రియాక్టర్‌లో ముడిసరకులు, తరువాత సాల్వెంట్ కలిపి ప్రాసెస్ చేసేటప్పుడు ఒక ఫార్ములా ఉంటుంది. ఉదాహరణకు రియాక్టర్‌లో 100 కిలోల ముడిసరుకు వేసి ఉత్పత్తి చేయాలనుకుంటే కచ్చింతంగా అంతే పరిమాణం వాడాలి.. అంతకు మించి వేస్తే ఇబ్బందులు వస్తాయి. అటువంటప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి, ఆవిరి ప్రమాణాలు పెరిగిపోతాయి. ఎక్కువ ప్రమాదాలు జరగడానికి ఇలాంటి ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. రియాక్టర్ నుంచి సాల్వెంట్ డ్రమ్ముల్లోకి పంపి అక్కడ ఫిల్టర్ చేస్తుంటారు. తరువాత డ్రయ్యర్ విధానంలో పొడిచేసి ప్యాకింగ్ చేస్తారు. ఈ విధానం మొత్తం పూర్తయ్యేవరకు సీనియర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నిచోట్ల సీనియర్ల కొరతతో జూనియర్లతో ప్రాసెసింగ్ చేస్తున్నారని బలరామ్‌నాయుడు అనే కెమికల్ ఇంజనీరు అభిప్రాయపడ్డారు. రియాక్టర్‌లో ముడిసరుకు, సాల్వెంట్ వేసిన తరువాత ప్రాసెసింగ్‌కు టైమ్ ఖరారుచేస్తారని, ఈ మధ్యలో తేడా వస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ విధానం అమలుచేసి సమస్య పరిష్కరించే అనుభవజ్ఞుల కొరత ఉందని, ఇందుకు కాస్ట్ కటింగ్స్ (తక్కువ వేతనాలు) విధానం అమలుచేస్తుంటారని ఆరోపించారు.

ఇదిలావుండగా ఫార్మా, కెమికల్ కర్మాగారాల్లో ఉద్యోగులకు పక్కాగా శిక్షణ అవసరమని ఏయూ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య సిద్ధయ్య అభిప్రాయపడ్డారు. మిగిలిన రంగాలకు భిన్నంగా ఈ కంపెనీల్లో పనిచేయాలంటే ఆయా కెమికల్స్‌పై అవగాహన అవసరమన్నారు. అయితే ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం శిక్షణ ఇచ్చిన తరువాతే విధుల్లోకి తీసుకుంటాయన్నారు.

జగన్‌కు మతిభ్రమించింది : అనకాపల్లి ఎంపీ రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్, తదితరులు

అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ప్రభుత్వం కంపెనీ ప్రతినిధుల ద్వారా పరిహారం చెల్లించినా మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. శుక్రవారం అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. అచ్యుతాపురం ప్రమాద సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదన్న జగన్ వ్యాఖ్యలను ఖండించారు. ప్రమాదంలో చనిపోయిన 17 మందికి చెక్కులు అందించినా, రాజకీయ లబ్ధి కోసం జగన్ ధర్నా చేస్తానని అంటున్నాడని, అటువంటి ధర్నాలకు భయపడేది లేదన్నారు. కంపెనీలో ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా కలెక్టరు, ఎస్పీతో సహా జిల్లాలో ఇతర శాఖల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టడం జగన్‌కు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కళ్లుండి చూడలేని విధంగా జగన్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. వైసీపీ హయాంలో గోపాలపట్నంలో ఎల్‌జీ పాలీమార్ కంపెనీలో ప్రమాదం జరిగితే సీఎంగా తాను ఎంతగానో స్పందించానని చెప్పుకో వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పట్లో ఆయన కనీసం సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లలేదన్నారు. కేవలం విమానాశ్రయంలో చర్చలు జరిపి వెళ్లిపోలేదా అన్ని ప్రశ్నించారు. విపత్తులు, ప్రమాదాలు జరిగిన సందర్భంలో సీఎం చంద్రబాబునాయుడు స్పందించిన తీరు ఏవిధంగా ఉంటుందో దేశం మొత్తానికి తెలుసునన్నారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగుతున్నాయని, ప్రమాదాల నివారణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. జగన్‌కు మొన్నటి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పార ని, అయినా మారలేదన్నారు. ఇదే పంథా కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, ముత్యాల పాప, టీడీపీ నేతలు దాడి రత్నాకర్, కోట్ని బాలాజీ తదితరులు ఉన్నారు.

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

... 5వ పేజీ తరువాయి

బయటకు వెళ్లే మార్గం లేక ఒత్తిడి పెరిగింది. కేబుల్ డక్ట్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం వ్యాపించింది. దీనికి కొంత సమయం పడుతుంది. అప్పటివరకు గదిలో పొగ, వాసన విషయాన్ని సెన్సార్లు పసిగట్టి అలారం మోగాలి. అలారం మోగిందా? సెన్సార్లు ఉన్నాయా? ఒకవేళ ఉండీ పనిచేయడంలేదా? మోగినా పనిలో ఉన్న వారు గుర్తించలేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెన్సార్లు మోగకుంటే మరేదైనా కారణంతో ప్రమాదం జరిగిందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది. రియాక్టర్‌ల నుంచి సాల్వెంట్ డ్రమ్ములోకి పంపేటపుడు పైపులు లీకైనా వెంటనే సెన్సార్లు అప్రమత్తంచేస్తాయి. మూడో అంతస్తులోనూ సెన్సార్లు ఏర్పాటుచేయలేదా? అని ఇంజనీరింగ్ నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా కర్మాగారంలో పీరియాడికల్‌గా తనిఖీలు చేయకపోవడంతోనే ఎసెన్షియాలో ప్రమాదం జరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. ఉత్పత్తులకు తగిన విధంగా కర్మాగారం సిద్ధంగా లేకపోతే అనుమతులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. తాజా ఘటన నేపథ్యంలో కర్మాగారంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సూచిస్తున్నారు. ఎసెన్షియా కంపెనీ ఘటనతో ఉమ్మడి జిల్లాలో అన్ని కర్మాగారాల్లో సెన్సార్లు, ఇతర పరికరాలు ఉన్నాయా? అన్నది సంబంధిత అధికారులు తనిఖీలుచేసి, అవి సక్రమంగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



చంద్రయాన్ నమూనాతో విద్యార్థులు, టీచర్లు

మాకవరపాలెం, ఆగస్టు 23 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాము మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర వ్యోమనౌకను దింపినఘనత ప్రపంచంలో మొట్టమొదటి సారిగా భారతదేశానికే దక్కిందన్నారు. ఇందులో భాగంగా ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరపాలని జరుపుకుంటు న్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రయాన్ నమూనాను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న వీరసూర్యచంద్ర

నాతవరం, ఆగస్టు 23 : ఉపాధి పనులతో అన్ని గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నర్సీపట్నం నియోజకవర్గం జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు.శుక్రవారం నాతవరం మండలం చెర్లోపాలెంలో ఎంపీడీవో హనుమంతరావుతో కలసి అధికారులు గ్రామ సభలో పాల్గొన్నారు. అలాగే సుందరకోట, గునుపూడి నాతవరం తదితర గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నారావు, సర్పంచ్ పైల శిరీష పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ యాజమాన్యాలపై చర్యలకు సీఐటీయూ డిమాండ్

నర్సీపట్నం, ఆగస్టు 23 : వరుస ప్రమాదాలకు కారణమైన ఫార్మాకంపెనీల యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలోని ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలిపోయి 18 మంది చనిపోయారని, 35మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.ఫార్మా కంపెనీలలో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. సమగ్ర విచారణ చేసి సంబంధిత కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నాతవరం, ఆగస్టు 23 : ఈ నెల 25న మండలంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ చంద్రమౌళి తెలిపారు. నాతవరం సబ్ స్టేషన్ కొత్త బ్రేకర్ నిర్మాణ పనులు చేపడుతుండడంతో సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు.

నాటు సారా తరలిస్తున్న ఒకరిపై కేసు

గొలుగొండ, ఆగస్టు 23 : నాటు సారా తరలిస్తున్న నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలాలని చెందిన దూరి బోడేసు నాటు సారా తరలిస్తుండగా, గొలుగొండ మండలంలోని సీతకండి గ్రామం వద్ద 20 లీటర్ల సారాతో అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

..రాజుకున్న వివాదం

... 5వ పేజీ తరువాయి

ఆయన స్థలం పరిశీలించడానికి డిపో ఆవరణలోకి వచ్చారు. ప్రభుత్వ స్థలంలో మట్టి తోలుతుంటే డిపో మేనేజర్, సెక్యూరిటీ గార్డులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డిపోలోకి లారీలను ఎలా రానిచ్చారని డిపో మేనేజర్‌పై మండి పడ్డారు. లీజుదారుడితో ఆర్టీసీ అధికారులు కుమ్మక్కయ్యారని విమర్శించారు. సీసీ ఫుటేజీలు ఆధారంగా గ్రావెల్ మట్టి తోలిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీని మీద అసెంబ్లీలో చర్చకు పెడతానని హెచ్చరించారు. ఈ ఖాళీ స్థలంలో రెండో ప్లాట్‌ఫారం నిర్మించాలన్నారు. స్పీకర్ వెంట కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, టీడీపీ నాయకులు ఉన్నారు.

వందలాది మందికి ఉపాధి

- లీజుదారుడు చిన్ని శ్రీనివాసరావు

ఆర్టీసీ స్థలం 15 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నామని, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందని డాక్టర్ చిన్ని శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ టెండర్లు ఆహ్వానిస్తే పాల్గొని 15 ఏళ్ల లీజుకు తీసుకున్నామని తెలిపారు. జీఎస్టీతో కలుపుకొని నెలకు సుమారు రూ.6లక్షలు అద్దె చెల్లిస్తున్నామన్నారు.

జగన్ పాలనలో..

... 5వ పేజీ తరువాయి

అనిత ఉపమాకలో మంచినీటి సమస్యతోపాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి వైసీపీ సర్పంచులు తీర్మానాలు చేయకపోతే వారే నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో డుమా పీడీ సందీప్, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి కొండబాబు, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, అబద్దం తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన...

... 5వ పేజీ తరువాయి

మృతి చెందిన 17 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున చెక్కులు అందించామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో చిన్నికృష్ణ, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, డీటీ శ్రీరామ్మూర్తి, డాక్టర్ అవినాష్, అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఉన్నారు.